హిందూపురం పురపాలక సంఘ ప్రజలు సమస్యలతో సతమతం అవుతున్నారు. 2019 ఎన్నికల ముందు టిడిపి ప్రభుత్వం ఉన్న సమయంలో అప్పటి, ఇప్పటి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వందల కోట్లతో పట్టణ అంతర్గత రహదారులు, మురుగు కాలువలు ఇతర పనులను ప్రారంభించారు. దీంతో పాటు పలు పనుల కోసం డిపిఆర్‌లను సిద్ధం చేయించి అనుమతుల కోసం ప్రభుత్వనికి ఆ సమయంలో పంపారు. 2019 ఎన్నికల్లో టిడిపి అధికారం కోల్పోవడంతో అప్పట్లో ప్రారంభించిన పనులు ఎక్కడివక్కడే ఆగిపోయాయి. అభివృద్ధి పనుల కోసం పంపిన డిపిఆర్ సైతం కనుమరుగైంది. దీంతో పట్టణ అభివృద్ధి గత 5 సంవత్సరాల నుంచి ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ప్రస్తుత ఎన్నికల్లో మళ్లీ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావాడం, హిందూపురం ఎమ్మెల్యేగా బాలకృష్ణ హ్యాట్రిక్ విజయం సాధించడంతో 'పురం' అభివృద్ధిపై పట్టణ వాసులు ఆయనపై గంపెడాశలు పెట్టుకున్నారు.

బాలయ్యా... అభివృద్ధి చేయాలయ్యా..!

◆ ఆగిన అభివృద్ధి పట్టాలెక్కేనా..?

◆ 'పురం'లో అపరిష్కృతంగా సమస్యలు

◆ టిడిపి హయాంలో పలు పనులు ప్రారంభం

◆ ఎమ్మెల్యే బాలకృష్ణపై ప్రజల ఆశలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ప్రజలను దశాబ్ధాలుగా అనేక సమస్యలు వేధిస్తున్నాయి. నందమూరి బాలకృష్ణ 2014లో హిందూపురం నుంచి మొదటిసారి పోటీ చేసిన తర్వాత ఈ ప్రాంతం అభివృద్ధిపై దృష్టి సారించారు. అభివృద్ధి కోసం ఒక ప్రత్యేక ప్రణాళికను తయారు చేశారు. అందులో 2014-2019 మధ్యకాలంలో కొన్ని పనులు పూర్తయ్యాయి. మరి కొన్ని అర్ధాంతరంగా ఆగాయి. ఇందులో పట్టణంలోని అంతర్గత రహదారుల అభివద్ధి, మురుగు కాలువల నిర్మాణం, ఇతర పనుల కోసం 2018లో రూ.66కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వాసవి ధర్మశాల రోడ్డును ప్రారంభించి పూర్తి చేశారు. పట్టణంలోని శివారు ప్రాంతాలతో పాటు అనేక కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతోపాటు పట్టణ అభివద్ధిలో భాగంగా రూ.100 కోట్లతో రింగ్ రోడ్డు నిర్మించాలని, ఇతర ప్రాంతాలకు వెళ్లే భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా చూసేందుకు, రాకపోకలను మెరుగుపరిచేందుకు రింగు రోడ్డు అత్యవసరమని గత టిడిపి ప్రభుత్వ హయాంలో నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. క్రీడాభివద్ధిలో భాగంగా ఎంజీఎం మైదానంలో ఇండోర్ స్టేడియం పనులను రూ. 2 కోట్లతో ప్రారంభించారు. ఇండోర్ స్టేడియం గోడలు గత ఐదు సంవత్సరాల నుంచి దిష్టిబొమ్మల్లా మైదానంలో దర్శనమిస్తున్నాయి. పేదలందరికీ పక్క గహాలు నిర్మాణం చేసి ఇవ్వాలని సంకల్పించి 10 వేల మందిని ఎంపిక చేశారు. ఇందులో తొలత 2వేల మంది లబ్ధిదారులను ఎంపిక చేసి టిడ్కో గహాల పనులను ప్రారంభించారు. ఈ గహాల నిర్మాణ పనులూ అసంపూర్తిగానే ఆగాయి. పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించడానికి నూతన ఉద్యానవనాలు నిర్మించడం, పాత వాటిలో సౌకర్యాలు కల్పించడం, సూరప్పకుంట చెరువు కట్టలను హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ తరహా అభివద్ధి చేయాలని పనులను చేపట్టారు. వీటితో పాటు 2014-19 కాలంలో పలు అభివృద్ధి పనులను అప్పటి ప్రభుత్వం చేపట్టింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం టిడిపి ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులను ఎక్కడికక్కడ ఆపేయాలని అధికారులకు సూచించించడంతో ఆ పనులన్నీ ఆగిపోయాయి.

ఎంజిఎం మైదానంలో దిష్టిబొమ్మలా ఉన్న ఇండోర్ స్టేడియం

బెంగళూరు రోడ్డు అభివద్ధి పనుల కోసం గత దశాబ్ద కాలంగా ప్రజలు ఎదురుచూస్తున్నారు. బాలకష్ణ ప్రత్యేక చొరవ తీసుకొని, పట్టణం నుంచి తూముకుంట పారిశ్రామిక వాడ, బెంగళూరు వరకు నాలుగు వరుసల రహదారి చేయాల్సి ఉందని అప్పట్లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలు ముందుకు సాగడం లేదు. పట్టణంలో భూగర్భ మురుగు నీటి వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఆ సమయంలో బాలకష్ణ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వాటిని ఆమోదించాలంటే పట్టణంలోని ప్రతి మనిషికి కనీసం 135 లీటర్ల నీటిని సరఫరా చేయాలని, అప్పట్లో అంత నీరు సరఫరా చేయకపోవడంతో భూగర్భ మురుగు నీటి కాలువల నిర్మాణ ప్రణాళిక పట్టాలు ఎక్కలేక పోయింది. ప్రస్తుతం పూర్తి స్థాయిలో నీటిని అందించే అవకాశం ఉంది. దీంతో సమగ్ర నీటి వ్యవస్థ ఏర్పాటుతోనే పరిశుభ్రమైన పట్టణం సాధ్యమవుతుంది. ఇక ప్రజలకు ఎన్నో సంవత్సరాలుగా వేధిస్తున్న నీటి సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే బాలకష్ణ చొరవ చూపి ప్రత్యేక పైప్ లైన్ ద్వారా గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి హిందూపురం పట్టణానికి సంవత్సరానికి 0.3 టీఎంసీల నీటిని శాశ్వత కేటాయింపు చేయించారు. ఇందుకోసం రూ.194 కోట్లతో పనులను చకచకా పూర్తి చేశారు. నీటిని పట్టణ సమీపంలోని కొట్నూరు సంపు వరకు తీసుకొచ్చారు. దీంతో పట్టణానికి రోజుకు 30 మిలియన్ లీటర్ల నీరు సరఫరా చేసేందుకు అవకాశం వచ్చింది. సరఫరాకు అవసరమైన ఓవర్ హెడ్ ట్యాంకులు, పైప్ లైన్ లేకపోవడంతో పూర్తిస్థాయిలో నీటిని అందించలేకపోతున్నారు. దీనికోసం రూ.75 కోట్లతో పట్టణ అంతర్గత పైప్ లైన్ పనులు చేపట్టారు. ఈ పనులు కొంత మాత్రమే జరిగాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పనులను రద్దు చేయడంతో పట్టణ వాసులకు అవసరమైన నీరు అందుబాటులో ఉన్నా ప్రజలకు అందించలేని పరిస్థితి నెలకొంది. ఇలా వందల కోట్లతో 2014-19 మధ్యకాలంలో చేపట్టిన అభివద్ధి పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడడం, కేంద్ర సహాయం సైతం ఉండడంతో అభివృద్ధి పనులపై మళ్లీ ఆశలు చిగురించాయి. 2014-19 మధ్యకాలంలో ప్రతిపాదనలు సిద్ధం చేసిన పనులను ఎమ్మెల్యే బాలకష్ణ ప్రత్యేక చొరవ తీసుకుని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధులు తీసుకుని వస్తే హిందూపురం పట్టణంతో పాటు నియోజకవర్గం అన్ని విధాలా అభివద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని ప్రజలు భావిస్తున్నారు. ఈ మేరకు ఆయన 'పురం' అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఆగి పోయిన రోడ్డు అభివృద్ధి పనులు

నిలిపోయిన టిడ్కో గృహ నిర్మాణాలు

సాయం అందించే అధికారులు ఉండాలే గానీ దర్జాగా ప్రభుత్వ భూములను కబ్జా చేసేయొచ్చన్న విధానం కదిరిలో కొనసాగుతోంది. పేదవాడు ఇంటి కోసం జాగా ఇమ్మని అడిగితే లక్షకారణాలు చెప్పి వారిని ముప్పతిప్పలు పెట్టే అధికారులకు యథేచ్ఛగా ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా కన్పించడం లేదు. కబ్జాలను నియంత్రించి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాల్సిన అధికారులకే అక్రమార్కులకు సాయం అందిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోతోంది.

ఆక్రమించు.. దర్జాగా నిర్మించు..!

◆ కదిరిలో ఆగని కబ్జాలు

◆ రూ.30 కోట్లు విలువజేసే ప్రభుత్వ భూమి ఆక్రమణ

◆ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు

◆ చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి పట్టణ విస్తీర్ణం పెరగడంతో భూముల విలువలకూ రెక్కలొచ్చాయి. దీంతో అక్రమార్కులు ప్రభుత్వ భూములపై కన్నేశారు. ఇందులో భాగంగా కదిరి రూరల్ మండలం ముత్యాల చెరువు గ్రామ పొలంలో సర్వే నెంబర్ 87-2లో 30సెంట్ల భూమిని కొందరు కబ్జా చేశారు. ఇందులో సొంతంగా నిర్మాణాలు చేపట్టడంతో పాటు ఇతరులకు ప్లాట్లు వేసి విక్రయాలు సైతం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ భూమిలో పునాదులు నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇది ప్రభుత్వ భూమి అయినప్పటికీ తప్పుడు పత్రాలతో వీటిని ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కబ్జాను అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు ఆ దిశగా అడుగు వేయడం లేదు. దీంతో కబ్జాదారులు రెచ్చిపోయి ప్రభుత్వ స్థలంలో ప్లాట్లు వేసి విక్రయించేస్తున్నారు.

కబ్జాలపై ఎమ్మెల్యే సీరియస్

రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అధికారం చేపట్టాక కదిరి ఎమ్మెల్యేగా గెలిచిన కందికుంట వెంకటప్రసాద్‌పై ప్రభుత్వ భూమలను కాపాడేలా చర్యలు చేపట్టారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకూడదంటూ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూములన్నింటినీ స్వాధీనం చేసుకోవాలని చెప్పారు. అక్రమ నిర్మాణాలను కూల్చే విధంగా చొరవ తీసుకున్నారు. అయితే రెవెన్యూ శాఖలో పనిచేసే కొందరు ఉద్యోగులు వత్తిధర్మం పాటించకుండా కబ్జాదారులకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. 30 సెంట్ల ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు గుప్పుమంటున్నాయి. కబ్జాలను నియంత్రించాలని ఎమ్మెల్యే ఆదేశించినా కోట్లు విలువజేసే ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదనే ప్రశ్న తలెతుత్తోంది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు మొద్దునిద్ర వీడి అక్రమ నిర్మాణాలను తొలగించి ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వం స్థలంలో జరుగుతున్న ఇంటి నిర్మాణ పనులు

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

కదిరి పరిసర ప్రాంతాల్లో ఖాళీ స్థలం కనబడితే కొందరు అక్రమార్కులు కబ్జా చేస్తున్నారు. బైపాస్ రోడ్డు చుట్టుపక్కల కోట్లాది రూపాయలు విలువచేసే ప్రభుత్వ భూములను ఇప్పటికే కొందరు ఆక్రమించారు. ఈ స్థలాల్లో అమ్మకాలు జరిగి, నిర్మాణాలు సైతం చేస్తున్నారు. వీటిని నియంత్రించాల్సిన రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ముత్యాలుచెరువు గ్రామ పొలంలోని సర్వేనెంబర్ 87-2 లో కోట్లు విలువజేసే ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం సరికాదు. తక్షణం ఈప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకోవాలి.

జివిఎల్.నరసింహులు, సిపిఎం పట్టణ కార్యదర్శి.

అనంతపురం ఎస్పీ కెవి.మురళీకృష్ణ

శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న

ఉమ్మడి జిల్లాకు కొత్త ఎస్పీలు

అనంతకు కెవి.మురళీకృష్ణ.. శ్రీసత్యసాయికి వి.రత్న

ప్రజాశక్తి -అనంతపురం క్రైం, పుట్టపర్తి రూరల్

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీలు బదిలీలు అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన ఐపిఎస్‌ల బదిలీల్లో భాగంగా ఈ రెండు జిల్లాల ఎస్పీలు బదిలీ అయ్యి వారి స్థానంలో కొత్త వారు నియమితులయ్యారు. అనంతపురం జిల్లా ఎస్పీ గా కెవి.మురళీ కృష్ణ నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న గౌతమి సాలిని ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్‌కు డీసీపీగా నియమించారు. ఆమె స్థానంలో అనకాపల్లి ఎస్పీగా పని చేస్తున్న కెవి.మురళీకృష్ణ అనంతపురం జిల్లాకు వచ్చారు. ఇక సత్యసాయి జిల్లాకు సంబంధించి వి.రత్న నిమమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌వి.మాధవరెడ్డి పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో మంగళగిరి 6వ బెటాలియన్ కమాండెంట్‌గా పని చేస్తున్న రత్న ఎస్పీగా సత్యసాయి జిల్లాకు వచ్చారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

ప్రారంభించిన సబ్ కలెక్టర్ అపూర్వభరత్

ప్రజాశక్తి-సోమందేపల్లి

యుటిఎఫ్ ఆధ్వర్యంలో పెనుకొండలో జిల్లా స్థాయి ఉపాధ్యాయుల క్రికెట్ టోర్నమెంట్ శనివారం ప్రారంభం అయ్యింది. ఈ పోటీలను పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ ప్రారంభించారు. యుటిఎఫ్ 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా యుటిఎఫ్ సీనియర్ నాయకులు జి.రామాంజనేయులు జ్ఞాపకార్థం యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పెనుకొండ పట్టణంలోని ప్రభత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో టోర్నీని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల శారీరక, మానసిక ఉల్లాసం కలిగి ఒత్తిడి లేని బోధన కొనసాగించేందుకు వీలవుతుందన్నారు. ఇలాంటి క్రీడాపోటీలు నిర్వహిస్తున్న యుటిఎఫ్ సేవలు అభినందనీయం అన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, సుధాకర్ మాట్లాడుతూ ఈ పోటీలు ఈ నెల 13 నుంచి ఆగష్టు చివరి ఆదివారం వరకూ సెలవు దినాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్ బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ కన్వీనర్ నరేష్, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, కార్యదర్శి నరేష్, హరికృష్ణ, సీనియర్ నాయకులు నారాయణస్వామి, మహాలింగప్ప, నబి, మారుతి, శేషాద్రి, చెన్నకేశవులు, కృష్ణా నాయక్, ఆదిజినేష్, నరసింహులు, జెవివి నాయకులు హరి, ఎన్‌జిఒ నాయకులు నాగార్జున, తెలుగు నాడు విద్యుత్ శాఖ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, వివిధ మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోటీలు ప్రారంభించి మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

క్రికెట్ మ్యాచ్ ఆడుతున్న ఉపాధ్యాయులు

ఆగిన రైల్వే పనులను పూర్తి చేయించాలి

కేంద్ర మంత్రి సోమన్నకు ఎంపీ, ఎమ్మెల్యేల వినతి

ప్రజాశక్తి-మడకశిర

కర్నాటక-ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో అర్ధాంతరంగా ఆగిన రైల్వే పనులను వెంటనే పూర్తి చేయడానికి తమ వంతుగా కృషి చేయాలని కేంద్ర రైల్వే, భారీ నీటి పారుదల శాఖల మంత్రి సోమన్నకి ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, ఎంపీ బికె.పార్థసారథి కోరారు. మడకశిరకు వచ్చిన కేంద్రమంత్రి సోమన్నకు శనివారం ఎమ్మెల్యే రాజు, ఎంపీ పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి ఘన స్వాగతం పలికారు. వారు మాట్లాడుతూ 2006లో ఎంపీ నిజాముద్దీన్ సహకారంతో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి రాయదుర్గం నుంచి మడకశిర మీదుగా తుమకూరుకు రైల్వే లైన్ మంజూరు చేయించాలని కోరగా కేంద్రం అప్పట్లోనే మంజూరు చేసిందన్నారు. తర్వాత టిడిపి హయంలో చంద్రబాబు సహకారంతో రైల్వే లైన్‌కు నిధులు మంజూరు చేయించారన్నారు. అయితే గత వైసిపి ప్రభుత్వం రైల్వే లైన్ పనులను అర్ధాంతరంగా ఆపేసిందన్నారు. కేంద్ర మంత్రి సోమన్న మాట్లాడుతూ మడకశిర కాంగ్రెస్ పార్టీ నాయకులు మడకశిరకు రైల్వే లైన్ మేము తెచ్చామని చెబుతారే కానీ వారు రాయదుర్గం నుంచి తుమకూరు రైల్వే లైన్‌కు కృషి చేయలేదని విమర్శించారు. అనంతరం కేంద్ర మంత్రి సోమన్న ఎమ్మెల్యే రాజు, ఎంపీ పార్థసారథి, గుండుమల తిప్పేస్వామితో కలిసి స్థానిక హిందూపురం రోడ్డులో జరుగుతున్న రాయదుర్గం - తుమకూరు రైల్వే లైన్ నిర్మాణ పనులను సందర్శించారు. రైల్వే లైన్ నిర్మాణం జరిగే స్థలంలో ఉన్న గృహ బాధితులకు నష్టపరిహారం ఇస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు.

సమావేశంలో పాల్గొన్న కేంద్రమంత్రి సోమన్న, ఎమ్మెల్యే రాజు, తదితరులు

సమస్యల నడుమ గురుకుల పాఠశాల

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి

పెచ్చు లూడిన తరగతి గదులను పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

రూరల్ మండలంలోని మలుగూరు నందమూరినగర్ దగ్గర ఉన్న బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధక్షులు బాబా వలి డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకుల బృందం శనివారం పాఠశాలను సందర్శించి తరగతి గదులు, వసతి గృహాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. ఆయా సమస్యలపై ప్రిన్సిపల్‌తో మాట్లాడారు. అనంతరం బాబావలి మాట్లాడుతూ పాఠశాలలో 640 మంది విద్యార్థులు ఉన్నారని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. గ్రంథాలయం, మెస్ హాల్, హాస్పిటల్ శిథిలావస్థకు చేరుకున్నాయని, ఈ భవనాలను తొలగించడానికి అనుమతులు వచ్చినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇటీవల వసతి గృహం పైకప్పు పెచ్చులూడి పడ్డాయిని, ఆ సమయం లో విద్యార్థులు లేక పోవడంతో ప్రమాదం తప్పిందన్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. పాఠశాలలో నెలకొన్న అన్ని రకాల సమస్యలను పరిష్కరించడంతో పాటు రెండు నెలలకోసారి వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, లేనిచో విద్యార్థులను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జయచంద్ర, చంద్రశేఖర్, హసేన్, హుస్సేన్, అఫ్రిద్, సురేష్, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాల కోసం పోరాడుదాం

ప్రజాశక్తి-చిలమత్తూరు

గ్రామపంచాయతీలో పని చేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు తక్షణమే బకాయి వేతనాలు చెల్లించాలని ఏపీ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. స్థానిక కార్మిక, కర్షక కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల వ్యాప్తంగా స్వచ్ఛభారత్ కార్మికులు గ్రామీణ ప్రాంతాల్లో చెత్తను ఎత్తడం, కాలువలను శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యాలను కాపాడడంలో కీలకపాత్ర వహిస్తున్నారన్నారను. అయితే గత ప్రభుత్వం కార్మికులకు వేతనాలు చెల్లించడంలో నిర్లక్ష్యం చేసిందన్నారు. 9 నెలల నుంచి వేతనాలు, కనీస సౌకర్యాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కూటమి ప్రభుత్వం వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి వెంకటేష్, స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ నాయకులు ఆదినారాయణ, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

అంగన్వాడీ సిబ్బంది సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ఎన్జీవో హోంలో అంగన్వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శ్రీదేవితో పాటు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ప్రాజెక్ట్ నాయకురాలు చంద్రకళ, సరస్వతి హాజరై మాట్లాడారు. అంగన్వాడీ లకు కనీస వేతనం, గ్రాట్యుటీ, పెన్షన్స్, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ప్రధానంగా భారంగా మారిన యాప్‌లను రద్దు చేయాలని, ఒకే యాప్ ద్వారా పనిచేయించాలని కోరారు. పెండింగ్ టిఎ, కూరగాయల బిల్లులు చెల్లించాలని, మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పెద్దన్న, సిఐటియు నాయకులు ఎస్‌హెచ్.బాషా, ఆదినారాయణ, అయూబ్ ఖాన్, జెవి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై విచారణ

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద జరిగిన పనులపై శనివారం సామాజిక తనిఖీ బృందం విచారణ చేపట్టారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి, పంచాయతీ రాజ్ పనులపై ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఆర్పీ చంద్రమోహన్ విచారణ జరిపారు. పంచాయతీల వారీగా ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ల ఆధ్వర్యంలో జరిగిన పనులపై డీఆర్పీలు, విఎస్ఎలతో విచారణ జరిపారు. పనులపై 21వ తేదీ నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం విచారణ చేపడుతుందని ఎస్ఆర్పీ చంద్రమోహన్ తెలిపారు. అనంతరం ఓపెన్ ఫోరం ద్వారా కూలీల సమక్షంలో విచారణ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో సోమ శేఖర్‌రెడ్డి, ఈసీ గంగాధర్ పాల్గొన్నారు.

జిపిఎస్ గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలి

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయచంద్రారెడ్డి, సుధాకర్

ప్రజాశక్తి-సోమందేపల్లి

జిపిఎస్ గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, ఎం.సుధాకర్ డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించ కుండా కూటమి ప్రభుత్వం జిపిఎస్ గెజిట్ నోటిఫికేషన్ తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో పెనుకొండ పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో గెజిట్ నోటిఫికేషన్ కాపీలను దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యద ర్శులు మాట్లాడుతూ గత ప్రభుత్వం జిపిఎస్ అమలు చేస్తామని పేర్కొనగా ఉద్యోగ, ఉపాధ్యాయుల పోరాటాలు ఫలితంగా తాత్కాలికంగా జీవోను విడుదల చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం పాత తేదీతో జిపిఎస్ అమలు చేస్తూ రాజపత్రాన్ని విడుదల చేయడం దుర్మార్గమన్నారు. 2023 అక్టోబర్ నుంచి సిపిఎస్ ఉద్యోగులందరినీ జిపిఎస్‌లోకి తెస్తూ రాజపత్రాన్ని ఇప్పుడు విడుదల చేయటం ఉద్యోగ, ఉపాధ్యా యులను మోసం చేయడమే అన్నారు. వెంటనే ఈ రాజ పత్రాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2003 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులనూ పాత పెన్షన్‌లోకి పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉద్యమ బాట పడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, జిల్లా కార్యదర్శి హరికృష్ణ, సీనియర్ నాయకులు నారాయణస్వామి, గంగాధర్, మారుతి, చెన్నకేశవులు, అమర్‌నాథ్‌రెడ్డి, ఆదిజినేష్, నాగార్జునరెడ్డి, షణ్ముఖ, నరేష్, నరసింహులు, శేషాద్రి, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండలో గెజిట్ నోటిఫికేషన్ ప్రతులను దహనం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

కదిరి అర్బన్ : పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, కార్యదర్శులు తాహిర్‌వలి, సుబ్బారెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వం సిపిఎస్ రద్దు చేస్తామని నమ్మబలికి ఆ స్థానంలో జిపిఎస్‌ను ప్రవేశపెట్టగా ఉపాధ్యాయ సంఘాల పోరాటాల ఫలితంగా గెజిట్ నోటిఫికేషన్‌ను ఆపిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం జిపిఎస్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం బాధాకరం అన్నారు. వెంటనే ఈ గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆజంబాషా, మల్లికార్జున, వివిధ మండలాల యుటిఎఫ్ నాయకులు రవివర్ధన్‌రెడ్డి, రమణనాయక్, ఖాజామోహిద్దీన్, సంతోష్, మనోహర్, బాలాజీనాయక్, బ్రహ్మేంద్ర, రమేష్‌బాబు, రామసుబ్బయ్య, రవినాయక్, నగేష్ పాల్గొన్నారు.

పుట్టపర్తిలో సత్యసాయి క్రికెట్ టోర్నీ

నేడు పోటీలను ప్రారంభించనున్న మాజీ క్రికెటర్ మురళీకార్తీక్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

యువతను ప్రోత్సహించడంతో పాటు క్రీడాస్ఫూర్తి పెంపొందించాలన్న లక్ష్యంతో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశారు. ఈ పోటీలు ఆదివారం నుంచి సత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం స్టేడియంలో ఏర్పాట్లను ట్రస్టు సభ్యులు పరిశీలించారు. 2025 నవంబర్‌లో సత్యసాయి జయంతి వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఏడాది పాటు ఈ వేడుకలు నిర్వహిస్తున్న నేపథ్యంలో దేశీయంగా ఏడు దశల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే యువత సత్యసాయి విద్యార్థులతో పాటు సత్యసాయి సేవా సంస్థల్లో సభ్యులై ఉండాలన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండాలని ఏడాదికి ఒకసారైనా ప్రశాంతి నిలయంలో సేవలో పాల్గొనే వారే అర్హులని తెలిపారు. ఆదివారం ఉదయం 8:30 గంటలకు ట్రస్టు సభ్యులతో పాటు మాజీ క్రికెటర్ మురళీకార్తీక్ పోటీలను ప్రారంభిస్తారు. పోటీల నిర్వహణకు స్టేడియంలో సత్యసాయి సేవాదళ్ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

స్టేడియంను శుభ్రపరుస్తున్న సేవాదళ్ సభ్యులు

ధర్మవరం నుంచి ప్రత్యేక బస్సులు : డీఎం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం డిపో నుంచి వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం సత్యనారాయణరావు తెలిపారు. డీఎం శనివారం తన ఛాంబర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గూగూడు ఉత్సవాలకు ఆదివారం నుంచి ఈ నెల 18వ తేదీ ధర్మవరం, బత్తలపల్లి నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పౌర్ణమికి అరుణాచలంకు, ఇటీవలే చెన్నైకు బస్సు సర్వీసును ప్రారంభించామన్నారు. అయోధ్య, కాశీకి బస్సులు నడపాలని నిర్ణయించామన్నారు. ఎవరైనా బృందంగా వస్తే బస్సు పంపుతామన్నారు. కార్యక్రమంలో శ్రీరాములు, సిస్టం సూపర్వైజర్ సుధాకర్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండలంలోని చామలగొంది పంచాయతీలోని భయ్యారెడ్డిపల్లి, సింగనవారిపల్లి గ్రామాల్లో శనివారం ప్రజలకు వైద్య పరీక్షలు చేసినట్లు వైద్యాధికారి మహేశ్వరిమారుతి తెలిపారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో గ్రామాల్లో షుగర్, బిపి, తదితర వ్యాధిగ్రస్తులు 90 మంది వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉపేంద్ర, సిబ్బంది, ఆశా వర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహన

ప్రజాశక్తి-బత్తలపల్లి

సమాజంలో ఆందోళనకరమైన రోగంగా వ్యాప్తి చెందుతున్న డయాబెటిస్ (మధుమేహం/షుగర్) ను మానసిక స్థైర్యం, సమయానికి మందులు వాడడం ద్వారా నియంత్రణలో ఉంచుకోవచ్చు నని హైదరాబాద్‌కు చెందిన ఎడ్యుకేషన్ పప్పేటియర్ పద్మిని రంగరాజన్ తోలు బొమ్మలాట ద్వారా తెలి పారు. స్థానిక ఆర్డీటీ ఆసుపత్రిలో శనివారం ఆమె టైప్-1 డయాబెటిస్‌పై వినూత్నరీతిలో తోలు బొమ్మలాట ద్వారా అవగాహన కల్పించారు. డయాబెటిస్‌పై అవగాహన కోసం 98660 81172 నెంబర్లో సంప్రదించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

19 న మండల సర్వసభ్య సమావేశం

అమరాపురం : ఈ నెల 19వ తేదీ ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భాస్కర్ తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు హాజరై మండల అభివృద్ధిపై సమీక్షతో పాటు చర్చిస్తారన్నారు. సమావేశానికి మండలంలోని జిల్లా పరిషత్, మండల పరిషత్ సభ్యులు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు, అన్ని శాఖల మండల స్థాయి ముఖ్య అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికతో తప్పక హాజరు కావాలని సూచించారు.

నింకంపల్లిలో వైద్య శిబిరం

హిందూపురం : ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సారథ్యంలో నడుస్తున్న ఎన్టీఆర్ ఆరోగ్య రథం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని శనివారం పట్టణంలోని నింకంపల్లిలో నిర్వహించారు. ఆ ప్రాంతంలోని ప్రజలకు వివిధ వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు డైమండ్ బాబా, రాష్ట్ర మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ ఫాజిల్, ఇన్‌ఛార్జి జబీబుల్లా, జనరల్ సెక్రటరీ శీన, లోకీ, హరి పాల్గొన్నారు.

వివేకానంద యోగాథెరపీలో..

పట్టణంలోని వివేకానంద యోగా థెరపీలో శనివారం సంతేబిదనూరు ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి అనురాధ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. 60 ఏళ్ల పైబడిన వారికి సంక్రమించే వ్యాధుల గురించి వివరించారు. అనంతరం అందరికీ వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యోగాథెరపీ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక ఆంధ్రా బ్యాంక్ సమీపంలోని మురికి కాలువ నుంచి దుర్వాసన వెదజల్లుతుండడంతో నాలుగేళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి తుమ్మల మనోహర్ పంచాయతీ సెక్రటరీ, ఈవోఆర్‌డి డి.రాజేంద్రకృష్ణకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన అధికారులు వెంటనే మురికి కాలువ నిర్మాణ పనులు చేపట్టారు.

పాంచజన్య సందీప్‌కు ఉత్తమ వ్యాపారవేత్త అవార్డు

ప్రజాశక్తి-హిందూపురం

జాతీయ స్థాయిలో దావత్ బాస్మతి బియ్యం వ్యాపారంలో హిందూపురం వాసి పాంచజన్య సందీప్‌కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఆ సంస్థ లండన్‌లో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో సందీప్‌కు ఉత్తమ వ్యాపార వేత్త అవార్డుతో పాటు మెమెంటో, ప్రశంసా పత్రం అందజేసింది. పాంచజన్య పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు శనివారం మాట్లాడుతూ తమ కుమారుడు పాంచజన్య సందీప్ దావత్ బాస్మతి బియ్యం కర్నాటక రాష్ట్ర డీలర్‌గా ఉన్నారన్నారు. కంపెనీ నిర్ణయించిన దాని కంటే ఎక్కువ వ్యాపారం చేయడంతో సంస్థ గుర్తించి అంతర్జాతీయ స్థాయిలో అభినందించడం సంతోషంగా ఉందన్నారు. ఇలాగే వ్యాపారాల్లో రాణించి హిందూపురం పేరును ఖ్యాతింపజేయాలని ఆకాంక్షించారు. పాంచజన్య పాఠశాల ఉపాధ్యాయులు సందీప్‌కు అభినందనలు తెలిపారు.

అవార్డు అందుకుంటున్న పాంచజన్య సందీప్

కంటి సంరక్షణపై నిర్లక్ష్యం వద్దు

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

ప్రజాశక్తి-హిందూపురం

కంటి సంబంధిత వ్యాధులపై నిర్లక్ష్యం వద్దని, ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కంటి వైద్య నిపుణులు సూచించారు. స్థానిక ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజన్, బెంగళూరుకు చెందిన శంకర్ కంటి ఆసుపత్రి సంయుక్తంగా శనివారం పట్టణంలోని సూగూరు ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో 110వ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 590 మందికి కంటి పరీక్షలు చేసి 185 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కుమార్‌రాజా, ఉషారాణి మాట్లాడుతూ 185 మందిని బెంగళూరులోని శంకర్ కంటి ఆసుపత్రికి తీసుకువెళ్లి ఆపరేషన్ చేసి అనంతరం హిందూపురం తీసుకొస్తామని తెలిపారు. జూన్‌లో ఆపరేషన్ చేయించుకున్న 180 మందికి తిరిగి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోడు అందజేశారు. శిబిరంలో కంటి వైద్య నిపుణులు సాక్షి, ఆసుపత్రి టీం లీడర్ శివప్రకాష్, వైద్య సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ప్రెస్ క్లబ్ పూర్తి స్థాయి కమిటీని శనివారం సీనియర్ పాత్రికేయులు రాంప్రసాద్, సురేష్‌రెడ్డి, ప్రకాష్ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. శాశ్వత గౌరవాధ్యక్షులుగా రాంప్రసాద్, గౌరవాధ్యక్షులుగా జె.ప్రకాష్, గౌరవ సలహా అధ్యక్షులుగా సురేష్‌రెడ్డి, ప్రధాన కార్యనిర్వహణ అధ్యక్షుడిగా ఎస్.షబ్బీర్ (ప్రజాశక్తి), అధ్యక్షులుగా సి.రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా కె.ప్రశాంత్‌కుమార్, కోశాధికారిగా ఫణిభూషణ్, ఉపాధ్యక్షులుగా రమేష్, అల్లిపీరా, రమేష్, సహాయ కార్యదర్శులుగా రాజేష్, చరణ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా అంజనప్ప, జబివుల్లాతో పాటు మరో ఐదుగురు సభ్యులతో పూర్తి స్థాయి కమిటీని ఎంపిక చేశారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా ఉన్న జర్నలిస్టుల ఇంటి స్థలం సమస్యను కలిసికట్టుగా పరిష్కరించుకుందామన్నారు. కార్యక్రమంలో వివిధ పత్రికలు, ఛానల్స్‌లో పని చేస్తున్న పాత్రికేయులు పాల్గొన్నారు.

శాశ్వత గౌరవాధ్యక్షులు రాంప్రసాద్‌ను సన్మానిస్తున్న పాత్రికేయులు

రిటైర్డ్ ప్రిన్సిపల్‌కు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ గోపాల్ జూన్ 30వ తేదీ ఉద్యోగ విరమణ పొందారు. దీంతో శనివారం పాఠశాల సిబ్బంది గోపాల్ దంపతులను ఘనంగా సన్మానం చేశారు. ఈయన 1989లో ఉద్యోగం పొంది వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయునిగా, లేపాక్షి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌గా పని చేశారు. మూడేళ్ల క్రితం స్థానిక మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌గా నియమితులయ్యారు. పలువురు ఉపాధ్యాయులు ఆయన సేవలను కొనియా డారు. గోపాల్ మాట్లాడుతూ ఉద్యోగం వచ్చినప్పుడు ఎంతో సంతోష పడ్డాను, ఇప్పుడు వీడ్కోలు పలుకుతుండగా అందరినీ వదిలిపోవడం అంత బాధాకరంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, చంద్రమౌళి, సీనియర్ నాయకులు మాధవనాయుడు, తోటి ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

గోపాల్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మహిళా డిగ్రీ కళాశాల నిర్వహణ భేష్

న్యాక్ బృందం అధ్యక్షులు ఆచార్య ఎస్.ఆర్ముగం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఎన్ఎస్‌పిఆర్ మహిళా డిగ్రి కళాశాల చదువుతో పాటు అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తుందని న్యాక్ కమిటీ మెంబర్, తమిళనాడు సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎస్.ఆరుముగం పేర్కొన్నారు. ఆచార్య ఆరుముగం అధ్యక్షతన ఉత్తర ప్రదేశ్‌లోని పూర్వాంచల్ యూనివర్సి టీ నుంచి డాక్టర్ మానస్ పాండే, కేరళ శ్రీశంకర విద్యాపీఠం ప్రిన్సిపల్ పి.పద్మలతో కూడిన న్యాక్ బృందం రెండు రోజులు ఇక్కడే మకాం వేసి ఉండి కళాశాలలో ఐదేళ్ల అభివృద్ధికి సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కమిటీ అధ్యక్షులు డా. ఆరుముగం తమ నివేదికను ప్రిన్సిపల్ డా. ప్రగతికి అందజేశారు. శుక్రవారం రాత్రి జరిగిన సమావేశంలో ఆచార్య ఎస్.ఆరుముగం మాట్లాడుతూ ఉన్నత విద్యాసంస్థల్లో నేషనల్ అసెస్మెంట్, అక్రిడిటేషన్ కౌన్సిల్(న్యాక్) గ్రేడ్ పొందడం ద్వారా కళాశాలలకు గుర్తింపుతో పాటు, నిధుల మంజూరు కూడా ఉంటుందన్నారు. కరువు ప్రాంతంలో బలహీన వర్గాల మహిళల విద్యావికాసం కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు, అధ్యాపకులు అద్భుతమైన విజయాలు సాధిస్తూ, అభివృద్ధి సాధిస్తున్నారని కొనియాడారు. కళాశాల మరింత పురోగతి కోసం కార్పొరేట్ సంస్థలు, దాతలు, పూర్వ విద్యార్థినులు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ మానస్ పాండే మాట్లాడుతూ ఈ కళాశాలలో విద్యార్థినులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యకలాపాల్లో అద్భుతమైన ప్రతిభ ప్రదర్శిస్తున్నారని ప్రశంసించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కళాశాలకు అదనపు స్థలంతో పాటు, ఆట స్థలం సమకూర్చితే గ్రామీణ యువతులు మరింతగా రాణించి, అద్భుతాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కళాశాల బృందం సమర్థవంతంగా పనిచేస్తున్నారని కితాబునిచ్చారు. తరగతుల నిర్వహణ, క్రీడలకు అవసరమైన స్థలం కేటాయించాలని ప్రభుత్వానికి సూచించారు. అనంతరం కమిటి సభ్యులు తమ నివేదికను బెంగళూరులోని న్యాక్ కార్యాలయానికి పంపించారు. న్యాక్ బృంద సిఫార్సులు, కళాశాల స్వీయ అధ్యయన నివేదికపై నిపుణుల మూల్యాంకనం మేరకు న్యాక్ కార్యాలయం కళాశాల గ్రేడ్‌ను నిర్ణయించి వారం రోజుల్లో ప్రకటిస్తుందని ప్రిన్సిపల్ తెలిపారు. సమావేశంలో ఐ.క్యు.ఎ.సి.సమన్వయకర్త శ్రీలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ వెంకటేసులు, అకడమిక్ సమన్వయకర్త డా.శ్రీధర్, యశోద, భోజప్ప, ఎల్ఆర్.రమేష్, పార్వతి, రవినాయక్, సుమంగళి, సరస్వతి, ప్రకాశ్‌రావు, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.


నివేదికను చూపిస్తున్న న్యాక్ కమిటీ సభ్యులు

బిసి న్యాయవాదుల సంఘం అడహాక్ కమిటీ ఎన్నిక

ధర్మవరం టౌన్ : జిల్లా బిసి న్యాయవాదుల సంఘం అడహాక్ కమిటీని రాష్ట్ర కన్వీనర్ సాకే నరేశ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో శనివారం నిర్వహించిన బిసి న్యాయవాదుల సంఘం సమావేశంలో గౌరవాధ్యక్షులుగా సీనియర్ న్యాయవాదులు జీసీ నల్లప్ప, కృష్ణమోహన్, అధ్యక్షులుగా మేకల రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా అశోక్ కుమార్‌ను నియమించారు. మిగిలిన కమిటీసభ్యులను త్వరలో ప్రకటిస్తామని నరేశ్ తెలిపారు. సమావేశంలో న్యాయవాదులు బన్నిలా మహేశ్, కిశోర్‌కుమార్, బిల్లే రవి, రామాంజనేయులు, బాబు, నరేంద్ర పాల్గొన్నారు.

ఆశా వర్కర్స్ యూనియన్ ఏర్పాటు

సమావేశమైన సిఐటియు నాయకులు

తనకల్లు : స్థానిక ఎమ్మార్సీలో శనివారం సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జిఎల్. నరసింహులు హాజరై మాట్లాడుతూ ఆశా వర్కర్లపై రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ వేధింపులు ఆపాలని, లేనిచో వారి పక్షాన పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ అధ్యక్షులు కళావతి, సిఐటియు మండల అధ్యక్షుడు ఒంటెద్దు వేమన్న, సిపిఎం నాయకులు శివన్న, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు వివి రమణ, నాగేంద్ర, వివిధ గ్రామాల ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సులేమాన్‌కు అభినందనలు

బత్తలపల్లి : స్థానిక జామియా మదీనా మసీదులకు సంబంధించి నూతన ముతవల్లిగా సులేమాన్‌ను ఎంపిక చేశారు. ముతవల్లి కరీం సాబ్ నుంచి శుక్రవారం రాత్రి మసీదు కమిటీని స్వాధీనం చేసుకొని నూతన కమిటీని ఎంపిక చేసి వక్ఫ్ బోర్డుకు పంపినట్లు నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ముతవల్లిగా సులేమాన్, వైస్ ముతవల్లిగా ముక్తుం ఇస్మాయిల్, సెక్రటరీగా ఎల్ఎస్.సుబహాన్, వైస్ సెక్రటరీగా షామీర్, ట్రెజరర్‌గా మదీనా మౌలా, కమిటీ మెంబర్స్‌గా టైలర్ రాజా, టైలర్ రఫీ, డ్రైవర్ మున్నా, షరీఫ్, ఎన్‌బిటి కాశీంవలి, తదితరులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ముతవల్లి సులేమాన్, నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ముస్లింల సమస్యలపై రాజీలేని పోరాటం సాగిస్తూ మసీదుల అభివృద్ధికి పాటుపడతామన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన ముతవల్లి సులేమాన్

మోటార్ వెహికల్ చట్టాలపై అవగాహన

ధర్మవరం టౌన్ : డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదని న్యాయవాది బాలసుందరి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శనివారం మోటార్ వెహికల్ యాక్ట్‌కు సంబంధించి విద్యార్థుల కు అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయవాది కొత్తగా ఏర్పడిన చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రధానంగా మైనర్లు వాహనాలు నడపకూడదన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు వాహనం ఇవ్వరాదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రశాంతి, హెడ్ కానిస్టేబుల్ నాగపవన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కుళ్లాయిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మోటారు వాహనాల చట్టంపై వివరిస్తున్న న్యాయవాది బాలసుందరి

నేరాలు ఘోరాలు

స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు చూపుతున్న సిఐ, ఎస్ఐ

దొంగ అరెస్టు.. రూ. 9 లక్షల బంగారం రికవరీ

బత్తలపల్లి : పట్టపగలు నేరాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి అతడి నుంచి రూ. 9 లక్షల విలువ చేసే బంగారు నగలను రికవరీ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ధర్మవరం రూరల్ సిఐ ఆరోహణ రావు, బత్తలపల్లి ఎస్ఐ పి.శ్రీనివాసులు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ధర్మవరం పట్టణంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన షేక్ ఖాజాపీరా చెడు అలవాట్లకు బానిసై డబ్బుల కోసం చోరీలకు పాల్పడేవాడు. జూన్ 21వ తేదీ బత్తలపల్లిలోని వినాయకనగర్‌లో బోర్‌వెల్ యజమాని వడ్డే రామాంజనేయులు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో దాచిన బంగారు నగలు ఎత్తుకెళ్లాడు. బాధితులు ఫిర్యాదు మేరకు చోరీ కేసుకు ఛేదించేందుకు ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రూరల్ సీఐ ఆరోహణరావు పర్యవేక్షణలో ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఎస్ఐ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు సుదర్శన్ నాయుడు, అనిల్‌కుమార్, పెద్దారెడ్డి, జనార్ధన్ గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం బత్తలపల్లి శివారులోని అన్నపూర్ణ డాబా వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా ఇదే తరహాలో చిలమత్తూరు మండలం మరువకొత్తపల్లి గ్రామంలో ఏడున్నర తులాల బంగారం నగలు చోరీ చేసినట్లు అంగీకరించాడు. ఇతడిపై కర్నాటకలోని టుంకూరు, అనంతపురం రూరల్, టౌన్, పామిడి పోలీస్ స్టేషన్లో పలు కేసులు నమోదైనట్లు, ధర్మవరం కోర్టులో హాజరుపరచినట్లు తెలిపారు. అలాగే గత మార్చి 10వ తేదీ బత్తలపల్లి మద్యం దుకాణంలో చోరీకి పాల్పడిన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని సిఐ తెలిపారు. చోరీ కేసుల్లో నిందితున్ని పట్టుకున్న సిఐ, ఎస్ఐ, కానిస్టేబుళ్లకు స్థానికులు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో వడ్డే సత్యప్ప, వడ్డే రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

మృతి చెందిన యువకుడు

గోరంట్ల : పట్టణంలోని సాధిక్ లాడ్జి వెనుక భాగంలో నివాసం ఉంటున్న రఫీ(35) శనివారం అనుమానా స్పద స్థితిలో మృతి చెందినట్లు సిఐ సుబ్బరాయుడు తెలిపారు. పోలీసు తెలిపిన వివరాలు.. రఫీ పట్టణంలోని రాఘవేంద్ర బెంగళూరు బేకరీలో పని చేస్తూ సాధిక్ లాడ్జి వెనుక నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి మద్యం తాగడానికి ఇంటిపైన ఉన్న డాబాపైకి వెళ్లాడు. శనివారం ఉదయం వెళ్లి చూడగా రక్తపు మడుగులో చనిపోయి ఉన్నాడని అతడి భార్య తస్లీమా ఫిర్యాదు మేరకు అనుమానా స్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడిని ధర్మవరం పట్టణానికి చెందిన నజీర్ అహ్మద్ కుమారుడు రఫీగా గుర్తించారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు..

పరిగి : మండలంలోని పెద్దిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం పాడి ఆవు విద్యుదాఘాతంతో మృతి చెందిం ది. స్థానికులు తెలిపిన వివరాలు.. రైతు శ్రీరామప్పకు చెందిన పాడి ఆవు శనివారం గ్రామ సమీపం లోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేయడానికి వెళ్లి షాక్‌కు గురై మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, ఆవు మృతి చెందడంతో రూ. 50వేలు నష్టపోయానని బాధిత రైతు శ్రీరామప్ప ఆవేదన వ్యక్తం చేశాడు. బాధిత రైతు కుటుంబాన్ని పశు సంవర్ధక శాఖ అధికారులు ఆదుకోవాలని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మృతి చెందిన ఆవుoooo

అయోమయంలో వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అధికారం పోవడంతో వైసిపి శ్రేణులు అయోమయంలో పడ్డాయి. ప్రధానంగా స్థానిక సంస్థల్లో తాము అధికారంలోనున్న సమయంలో చోటు చేసుకున్న అవినీతి అంశాలను ఇప్పుడు లేవనెత్తి అధికార పక్షానికి ఒక అస్త్రాన్ని అందించే ప్రయత్నం ఈ వారంలో కనిపించింది. ప్రధానంగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనూ, నగర పాలక సంస్థ సమావేశంలోనూ ఇదే కనిపించింది. ఈ రెండు చోట్ల కూడా వారు అధికారంలో ఉన్న సమయంలో అంటే గడిచిన ఏడాదిలో అభివృద్ధి కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందంటూ వైసిపి సభ్యులే రెండు చోట్ల లేవనెత్తడం చర్చనీయాంశమైంది. నిబంధనలకు విరుద్ధంగా కొందరు నేతల ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు బిల్లులు ఇచ్చారంటూ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ లేవనెత్తడం, దానిపై చర్యలు తీసుకోవాలని ఆమె పట్టుబట్టడం ఇప్పటికీ అధికారపార్టీ నేతలకే అంతుబట్టలేదు. ఒకానొక దశలో సహనం కోల్పోయిన టిడిపి నేతలు అధికారంలో ఉన్న సమయంలో మీరు ఏమి చేసారని ప్రశ్నించడం గమనార్హం. ఈ సమావేశంలో ఒక ప్రజాప్రతినిధి తోటకు తాగునీటిని మళ్లించి ప్రజలను ఇబ్బందులకు గురిచేసారని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ఆరోపించారు. దీన్ని అధికారులు కూడా అంగీకరించి ఇప్పుడు తొలగించామని చెప్పారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అదే సమయంలో నగర పాలక సంస్థలోనూ చెత్త డంపింగ్ యార్డులో అవినీతి జరిగిందని వైసిపి కార్పొరేటర్లతోపాటు డిప్యూటీ మేయర్లు కొగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతిలు పోటీలు పడి ఆరోపించారు. మీ హయంలోనే జరిగింది కదా అన్న ఎమ్మెల్యే ప్రశ్నకు వారిద్దరి సమాధానం లేకుండా పోయింది. ఇలా రెండు చోట్ల కూడా సొంతపార్టీ వారే అవినీతి ఆరోపణలు చేయడంతో ఏమి చేయాలో పాలుపోని పరిస్థితుల్లోకి ఇప్పటి అధికార పార్టీ నేతలు పడ్డారు. మరోవైపు పార్టీ కార్యక్రమాల విషయంలోనూ వైసిపి అయోమయంలోనే పడింది. కొత్తగా నియమితులైన నియోజకవర్గ ఇన్‌ఛార్జులు పాత స్థానాల వైపు చూస్తుండగా, కొత్త వారు తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఇంకో వైపు జిల్లా అధ్యక్షుల మార్పులు జరగాలని పట్టుబడుతున్నారు. ఇలా అన్ని విధాలుగా అధికారం కోల్పోతూనే వైసిపి శ్రేణులు అయోమయంలో పడ్డాయి. పార్టీ విధానాలను ఉల్లంఘించారని కదిరి మాజీ ఎమ్మెల్యే సిద్ధారెడ్డిపై ఆ పార్టీ వేటు వేసింది. దీనిపై ఆయన ఘాటుగానే స్పందించారు. ఇక అధికారంలోకి వచ్చిన టిడిపి నేతలు ఉత్సాహంతో ఉన్నారు. సత్యసాయి జిల్లాలో వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మలు ఆ జిల్లా అభివృద్ధిపై సమీక్షలు నిర్వహించారు. కలసికట్టుగా జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పార్టీల రాజకీయాలు ఇలా జరుగుతున్న సమయంలో ఇప్పటికే సత్యసాయి జిల్లా కలెక్టర్ బదిలీ అయి కొత్తగా చేతన్ బాధ్యతలు చేపట్టారు. తాజాగా రెండు జిల్లాల ఎస్పీలు బదిలీ అయ్యి వారి స్థానంలో కొత్త వారు వచ్చారు. పాలన మారిన తరుణంలో అధికారుల మార్పులు జరుగుతున్నాయి. ముఖ్యమైన అధికారుల బదిలీ అనంతరం దిగువ స్థాయి అధికారుల్లోనూ మార్పులు జరిగే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.